క్లుప్తంగా

పంటలు ఎండిన రైతులను ఆదుకోవాలి

మరికల్: నీరులేక పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు హన్మంతు, గుర్రల శ్రీనివాస్ కోరారు. ఆదివారం మక్తల్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలోనే వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పంటలకు నీరందని పరిస్థితి నెలకొందన్నారు. కొన్ని రోజులుగా ఎండల తీవ్రత అధికం కావడంతో రైతుల కళ్లెదుటే పంటలు ఎండుతున్నాయని వాపోయారు. ప్రభుత్వం బాధిత రైతులకు ఎకరా రూ. 20వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



మద్దూరు: మండలంలోని లింగల్‌చేడ్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. ఎక్కమేడ్ గ్రామానికి చెందిన గాదెపాక బాలవర్ధన్ శనివారం అర్ధరాత్రి లింగల్‌చేడ్ వాగులో ఇసుకను నింపుకొని వెళ్తుండగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



నారాయణపేట ఎడ్యుకేషన్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆదివారం తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పాతపల్లి నర్సింహ, ప్రధాన కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ.. సంఘం తరపున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ఏకలవ్య భవనం, ఏకలవ్యుడి విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. చలివేంద్రం ఏర్పాటుకు కృషిచేసిన జిల్లా నాయకులు రామకృష్ణ, రవికుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం గౌరవాధ్యక్షుడు రాములు, రామకృష్ణ, అశోక్ కుమార్, రవి, నారాయణ, రమేశ్, బస్సప్ప, కురుమప్ప, నవీన్, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



మద్దూరు: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజన్‌లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుస్తులు పంపించిన దుస్తులను ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి వచ్చినప్పటి నుంచి ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ఇమామ్, మౌజన్‌లకు కొత్త దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం కరపత్రాల ఆవిష్కరణ



మరికల్: వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల సభ్యులు అంజిలి, రఘు మాట్లాడుతూ.. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 25 నుంచి మే 25 వరకు వివిధ అంశాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాలను వెలికి తీసేందుకు శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేణు, శిరీష, శివ పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి కృషి చేద్దాం

కృష్ణా: దేశాభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షుడు నర్సప్ప అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్ కుమార్ దీక్షిత్ ఇంట్లో మండల నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో శక్తిసింగ్, మల్‌రెడ్డి, సురేశ్ భట్ పాల్గొన్నారు.

ఉపాధి.. పర్యవేక్షణ ఏది?



అమ్మపల్లిలో ఉపాధి హామీ పనులకు వచ్చిన కూలీలు (ఫైల్)

- మాగనూర్ మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత
- 16 జీపీలకు గాను ఐదుగురు మాత్రమే..
- ఏపీఓ పోస్టు సైతం ఇన్‌చార్జ్‌తోనే నెట్టుకొస్తున్న వైనం
- అవస్థలు పడుతున్న కూలీలు

మాగనూర్: కూలీలకు సొంతూరిలోనే ఉపాధి కల్పించి.. వలసలను నివారించాలనే ఉద్దేశంతో అమలుచేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత నెలకొంది. ఫలితంగా ఉపాధి కూలీ పనుల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. మాగనూర్ మండలంలో 16 గ్రామపంచాయతీలు ఉండగా.. ఐదు జీపీలకు మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. మిగిలిన 11 జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏపీఓ పోస్టు సైతం ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు.

పనుల నిర్వహణకు ఆటంకం..

మండలంలో 4,370 జాబ్‌కార్డులు ఉండగా.. 7,583 మంది కూలీలు ఉన్నారు. వీరిలో 1,260 మంది మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా మస్టర్ల నిర్వహణ, హరితహారం, జాబ్‌కార్డుల అప్‌గ్రేడ్ ఇలా ఏడు రిజిస్టర్ల నిర్వహణతో పాటు గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహించే అభివృద్ధి పనులను పర్యవేక్షించడం, ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రతి కూలీకి ఉపాధి పని కల్పించడం తదితర పనులను చేస్తుంటారు. అయితే మండలంలోని ఉజ్జెల్లి, భైరంపల్లి, అమ్మపల్లి, కొల్పూర్, ఒబ్లాపూర్, మాగనూర్, గురువలింగంపల్లి, తళంకేరి, నేరడగందొడ్డి, పర్మన్‌దొడ్డి, కొత్తపల్లి గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో ఉపాధి పనుల నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులపై అదనపు భారం పడుతోంది. కూలీలకు సైతం అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్ల ఖాళీలను భర్తీ చేయాలని కూలీలు కోరుతున్నారు.

అదనపు భారం..



మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పూర్తిస్థాయిలో లేకపోవడం కారణంగా అదనపు బాధ్యతలతో ఇబ్బందులు పడుతున్నాం. నేను 2010 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. సీనియర్ మేటి వేతనం రూ. 8,500 మాత్రమే ఇస్తున్నారు. మందిపల్లి నుంచి మాగనూర్‌కు పనుల కోసం వెళ్లి రావాలంటే 18 కి.మీ. దూరం ఉంటుంది. రవాణా ఖర్చులకు కూడా వేతనం చాలడం లేదు.

– మహేష్, ఫీల్డ్‌అసిస్టెంట్ మందిపల్లి

ఇబ్బందులు పడుతున్నాం..



ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో పనులు కావాలని ఎవరిని అడగాలో తెలియడం లేదు. ఒక్కోసారి పనులకు ఆటంకం కలుగుతుంది. ఉన్నతాధికారులు స్పందించి అన్ని గ్రామపంచాయతీకి తప్పనిసరిగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి.

– మహాదేవమ్మ, ఉపాధి హామీ కూలీ, అమ్మపల్లి

ఉన్నతాధికారులకు తెలియజేశాం..



మండలంలో ఉపాధి హామీ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. త్వరలోనే పూర్తిస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించే అవకాశం ఉంది.

– హర్షవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏపీఓ

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ

నారాయణపేట ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి 100, 400 మీటర్ల పరుగుపందెం, జావెలిన్ త్రో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. అండర్–14 విభాగం 400 మీటర్ల పరుగుపందెంలో మక్తల్‌కు చెందిన రాజేశ్వరి సిల్వర్ మెడల్, అండర్–14 జావెలిన్ త్రోలో కోటకొండకు చెందిన సోనీ బ్రాంజ్ మెడల్, అండర్–18 విభాగం 400 మీటర్ల పరుగు పందెంలో కోటకొండకు చెందిన విఘ్నేశ్వర్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు, జిల్లా ప్రజలు అభినందించారు.

వీరభద్రేశ్వరుడి ఉత్సవాలకు రావాలని ఎంపీకి ఆహ్వానం



దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లిలో వెలసిని భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వచ్చేనెల 1నుంచి 4వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. శుక్రవారం అంకురార్పణ, బుధవారం పల్లకీ సేవ, నందికోళ్ల సేవ, అగ్నిగుండ ప్రవేశం, గురువారం డోలారోహణం, మహా రథోత్సవం, శుక్రవారం రుద్రాభిషేకం, అఖండ హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు మోనేష్ ఆచారి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం



మక్తల్‌లో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: దేశ ప్రజల సమానత్వాన్ని కాంక్షిస్తూ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా స్వాతంత్య్ర పోరాటంలో అసువులు బాసిన భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలని పలువురు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మక్తల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘాల నాయకులు అజయ్, కిరణ్, భాస్కర్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య, అజయ్, గోపి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్ మండల కేంద్రంలో..



మద్దూరు మండలం అప్పిరెడ్డిపల్లిలో..



ధన్వాడ మండలం పాతపల్లిలో..

➪ నర్వ మండల కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, ఎం.కృష్ణ, అరుణ్ కుమార్, భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, శరణప్ప, వివేక్‌వర్ధన్, గడ్డం నర్సింహులు, అయ్యన్న పాల్గొన్నారు.

➪ భగత్‌సింగ్, రాజ్‌గురుదేవ్‌ల స్ఫూర్తితో విద్యార్థులు, యువత ముందుకు సాగాలని మాస్‌లైన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణయ్య కోరారు. ధన్వాడ మండలం పాతపల్లిలో భగత్‌సింగ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టేరప్ప, బాలు, కురుమూర్తి, గణేశ్, గోవర్ధన్, శీను, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

➪ ఊట్కూరు మండలంలోని బిజ్వార్‌లో పీడీఎస్‌యూ, పీవైఎం, సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.కృష్ణ, సలీం, సిద్ధూ, భిక్షపతి, బాలకిషన్‌గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

➪ మద్దూరు పట్టణం, అప్పిరెడ్డిపల్లి గ్రామంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొండ నర్సింహులు, ఎ.హరి, అశోక్, అలీ, హన్మంతు, మల్లేష్, కృష్ణ, వెంకటప్ప, లాలు పాల్గొన్నారు.

➪ కృష్ణా మండలం ఖాన్‌దొడ్డిలో పీవైఎల్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్, శివశంకర్, మంజునాథ్, మల్లికార్జున్, మహదేవ్, తాయప్ప, తిప్పయ్య, శివకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

➪ మాగనూర్ బస్టాండ్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలు, సీపీఎం నాయకులు భరత్‌కుమార్, ఆంజనేయులు, వెంకటయ్య, మహదేవ్, నర్సింహులు, ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్న నర్సింహ, రాఘవేంద్ర, సురేష్, శంకర్, సూర్యప్రకాష్, నాయ్యాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద క్రీడాకారుడికి కాంస్య పతకం



నారాయణపేట ఎడ్యుకేషన్: పారా అథ్లెటిక్స్‌లో దామరగిద్దకు చెందిన కనకప్ప కాంస్య పతకం సాధించినట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో కనకప్ప పాల్గొని టీ–44 క్యాటగిరీ లాంగ్ జంప్‌లో 5.30 మీటర్లు దూకి కాంస్య పతకం సాధించినట్లు వివరించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు



అమరచింత: మున్సిపల్ కేంద్రంలో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తమ వార్డుకు 4 రోజులుగా తాగునీరు అందడం లేదంటూ రాంనగర్ కాలనీకి చెందిన ప్రజలు ఆదివారం రోడెక్కి ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ.. పట్టణంలో సోర్స్‌బోర్లు 16 ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తే వార్డులకు నిరంతరం తాగునీరు అందుతుందన్నారు. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని చెప్పడమే తప్ప కనీసం ఓవర్‌హెడ్ ట్యాంకులను నింపకుండా నీటిని వృథాగా రోడ్లపై వదిలేస్తున్నారని ధ్వజమెత్తారు. మిషన్ భగీరథ సిబ్బంది ఎప్పుడు నీటిని వదులుతారో అన్న విషయాలు తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. కాగా, పైప్‌లైన్ల లీకేజీ కారణంగా తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగిందని, మరోమారు ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఏఈ హర్షవర్ధన్ హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. ఆటో రాము, లింగమ్మ, ఎనుముల శ్రీను, పుణ్యవతి, మార్కవెంకటేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ రాంలాల్

మక్తల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని మక్తల్ సీఐ రాంలాల్ అన్నారు. ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభకనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. రోజులో కొంత సమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు. విద్యార్థులు అనూష, అఖిల, శ్రావణి, గాయత్రి, రాజేశ్, స్వప్న, పరశురాములు, దేవకమ్మ, రమేశ్, కవిత, అరుణ, సురేశ్ క్రీడా పోటీల్లో రాణించినట్లు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యాంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం



మాట్లాడుతున్న సత్యయాదవ్

ధన్వాడ: ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ అన్నారు. ఆదివారం ధన్వాడలోని వీవర్స్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో వృద్ధాప్య పింఛన్ రూ. 4వేలకు పెంచుతామని, రైతుభరోసాను పెంచుతామని, రూ. 2లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామని, మహిళలకు ప్రతినెలా రూ. 2,500 ఇస్తామని, నిరుద్యోగులకు రూ. 4వేల భృతి ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. మాట తప్పిందన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణాలు మాఫీ చేయడంలోనూ విఫలమైందని విమర్శించారు. 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల ప్రజలలో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, బీజేపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అనంతరం కార్యకర్తలు ఆయనను శాలువాతో సన్మానించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు శివరాజ్, నాయకులు ఉదయభాను, రాంచంద్రయ్య, ఉమేష్, గోవర్ధన్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లయ్య, మాకం సురేందర్, రవికుమార్, రాజుసాగర్ ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ ఆంజనేయులు

నారాయణపేట: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఏఎస్ఐ ఆంజనేయులు సూచించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించడంతో పాటు రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కారు అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయరాదన్నారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయకూడదని తెలిపారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. పరిమిత వేగంలో వాహనాలను నడపాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100ను సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయశాస్త్ర విభాగంలో బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

మాగనూర్: స్థానిక సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి వ్యవసాయశాస్త్ర విభాగంలో అత్యుత్తమ ప్రతిభకనబరిచి బంగారు పతకంతో పాటు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వరిసాగులో స్థిరత్వం కోసం డైరెక్ట్ సీడెడ్ రైస్ పరిశోధనపై పనిచేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ముంబైలోని యూఎస్ఏ ఆధారిత కంపెనీ ఫుడ్ చైన్ ఐడీలో ఈఎస్ నిపుణుడిగా పనిచేస్తున్నట్లు వివరించారు. తనకు న్యూఢిల్లీ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 63వ స్నాతకోత్సవంలో బంగారు పతకం, పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. దేశ రైతులకు సేవ చేయడంతో పాటు వ్యవసాయాన్ని స్థిరంగా, వాతావరణ మార్పులకు తట్టుకునేలా చేయడమే లక్ష్యమన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



మద్దూరులో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

మద్దూరు/ధన్వాడ: మద్దూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011–12 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక షాగార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, ఆశోక్‌కుమార్, వేగప్ప, సవిత, అలివేలు, భానుప్రకాష్, కృష్ణ, వసంతకుమార్, శ్రీనివాస్, శంకర్, అంజనాయక్, సోమ్లానాయక్, అనిత, వరలక్ష్మిని శాలువా, మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేష్, కృష్ణవేణి, రవీందర్, నీరజ, మల్లేష్, నీలమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

➪ ధన్వాడ మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009–2010 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ గురువులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. పాఠశాల రోజులను గుర్తుచేసుకుని సంబురపడ్డారు.

ధ్రువపత్రాల కోసం దరఖాస్తుల వెల్లువ



దామరగిద్దలోని మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేస్తున్న యువత

దామరగిద్ద: మీసేవ కేంద్రాల్లో వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు సబ్సిడీపై రుణాలు అందించేందుకు రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఆదాయం, కులధృవీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. కాగా, ఈ విషయమై మండలానికి క్యాటగిరీ వారీగా ఎన్ని యూనిట్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ సాయిలక్ష్మిని వివరణ కోరగా.. తమకు రుణాల మంజూరుకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు అందలేదని తెలిపారు. అయితే రాజీవ్ యువ వికాసం పథకంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం లేదు. కేవలం వచ్చేనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో నిరుద్యోగ యువత మీసేవ కేంద్రాలకు బారులు తీరుతున్నారు. క్యాటగిరీల వారీగా యూనిట్ల మంజూరుపై స్పష్టత కొరవడిందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దరఖాస్తుదారులకు సరైన సమాచారం అందించాలని కోరుతున్నారు.